# 15

# ఇట్టే వంట బట్టేసింది!

ఇంట్లో అంతా హడావిడిగా వుంది. అందరూ కంగారుపడిపోతున్నారు. హాస్పిటలుకీ ఇంటికీ పరుగులు పెడుతున్నారు. గేటు ముందు మీడియావాళ్ళు ఇసకవేస్తే రాలనట్లుగా గుమిగూడిపోయారు. ప్రశ్నలమీద ప్రశ్నలు వేసి పీక్కుతింటున్నారు. వాళ్ళడిగిన వాటికి సమాధానం చెప్పినా తంటాయే, చెప్పకపోయినా తంటాయే. ఒక మాట మాట్లాడితే తక్కువ. రెండు మాట్లాడితే ఎక్కువా!

అమ్మగారి చుట్టూ చేరిపోయారు ఆప్తులు. ఆంతరంగికులు. అవతల ఆయన పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే వుంది. నిన్న పరిస్థితి చూసి చాలా ఆదుర్దాపడి పోయారు. ఆ ఆయాసం, చెమటలూ చూస్తుంటే ఒకస్థితిలో అంతా అయిపోయిందేమో అనిపించింది. దేవుడి దయవల్ల ఆపద తప్పింది. కానీ ఇంకా పరీక్షలవీ చేసి ఫలితాలవీ వస్తేగానీ ఏమీ చెప్పలేం అన్నారు వైద్యులు.

అనుకోని ఆపద ఇది. ఊహించని పరిణామం. ఆయనకి కాస్త గడ్డాలూ, మీసాలూ వచ్చిన పిల్లాడు ఒకాడుండుంటే ఏ బాధాలేకపోను. ఉన్నది ఇద్దరూ కూతుళ్ళే. వాళ్ళు మరీ బొడ్డూడని వాళ్ళు. కాబట్టి లాభం లేదు. ఏతావాతా భారం అంతా మరి అమ్మగారి నెత్తినే పడింది.

ఆవిడేమో ఇల్లే నారాయణమ్మ అనుకునే రకం. హాస్పిటలుకి వెళ్ళి ఆయన దగ్గరుంటాను అంటుంది. అక్కడికి వెళ్ళేం చేస్తావు? లోపలికి వెళ్ళనివ్వరు. వరండాలో కూర్చోవాల్సిందే. అయినా ఇక్కడ ఇంత రాచకార్యం ముందు పెట్టుకుని అటూ ఇటూ పోతే ఎలా? అని ఆపేస్తున్నారు చుట్టూ వున్నవాళ్ళు. వాళ్ళ మాటలు అక్షరాలా నిజం.

అక్కడ ఆయన గుండె తిన్నగా పనిచేయడం లేదు అంటున్నారు డాక్టర్లు. శరీరంలోకి ఏ ఇతర అవయవానికి తేడా వచ్చినా అంత ప్రమాదమేమీ లేదు. కానీ గుండెకి తేడా వస్తే ప్రమాద ఘంటికలు మోగినట్లే. అమంగళం ప్రతిహతమవుగాక. జరగరానిది జరిగితే మరి ఆ పదవిని అలంకరించడానికి వారసులుండాలి కదా!

కొడుకైతే ఏ ఇబ్బందీ వుండదు. మగవాడు కాబట్టి పుట్టకతోనే అంతో ఇంతో రాజకీయం వచ్చే వుంటుంది. పుటకతో రాకపోయినా తండ్రిని చూసి నేర్చుకునైనా వుంటాడు. మరి భార్య విషయం అలా కాదు. ఆంగికం, ఆహార్యం, వాచకం అన్నీ చూసుకోవాలి. మగవాడైతే వేసుకున్న తెల్లబట్టలమీదే రంగు కండువా కప్పుకుంటే సరిపోతుంది. ఆడవాళ్ళకు ఆ వెసులుబాటు లేదు. కట్టూబొట్టూ వినయంగా, వందనంగా వుండాలి. మాటమంచీ బావుండాలి. అన్నింటినీ మించి అంతో ఇంతో లోకజ్ఞానం కూడా వుండాలి.

ఎంత వారసత్వ హక్కుగా పదవిలోకి వచ్చినా, దేశ రాజధాని ఏదమ్మా అని అడిగితే తణుకో, తాడేపల్లి గూడెమో అనకుండా ఢిల్లీ అనైనా చెప్పగలగాలి కదా!

హైదరాబాద్‌లో దర్శనీయ స్థలాలు ఏవీ అంటే ఖజానా, తనిష్క్, కళాంజలి అనకుండా చార్మినారూ, గోల్కొండ కోటా అని చెప్పగలిగేటంత పరిజ్ఞానమైనా వుండాలి కదా! హఠాత్తుగా ఆ లోకజ్ఞానం రావడం అంటే కాస్త కష్టమే. ఇదేమైనా "రెండ్రోజుల్లో ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడ్డం నేర్పబడును" వంటి ప్రకటనల మాయాజాలం కాదు మరి.

కాస్త మెళకువలు తెల్సిన వారు పూనుకోవాలి. ప్రస్తుతం ఏ విషయం నేర్పాలన్నా నిష్ణాతులున్నారు. ఆ కోవకు చెందినదే మహిమా తివారీ! పేరు అలా వున్నా మన అవనిగడ్డ అమ్మాయే. ప్రపంచ, ఖండ, దేశస్థాయిలో జరిగే అందాల పోటీల్లో అయితే లక్షల డబ్బు పుచ్చుకుని కళ్ళూ పళ్ళూ అన్నీ సరిచేసి చెక్కముక్కని చిత్రికపట్టి బొమ్మను తయారు చేసినట్లూ చేస్తారు. ఈ మహిమా తివారీ అంతగొప్పది కాదుగానీ, మిస్ కడప, మిస్ అనంతపురం, మిస్ చీరాల వంటి చిన్న ప్రదేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొనే సుందరాంగులకు శిక్షణ ఇస్తుంది. తీర్చిదిద్దుతుంది.

ఇప్పుడా మహిమా తివారీనే పట్టుకొచ్చారు. రహస్యంగా శిక్షణా కార్యక్రమం మొదలైంది. ముందు ఐబ్రోస్, హెయిర్ కటింగ్, మెనిక్యూర్, పెడిక్యూర్ వంటివన్నీ

చేసేసింది మహిమ. పగలంతా దానికే సరిపోయింది. ఇక సాయంత్రం నుండీ మాటతీరు మీద శిక్షణ ప్రారంభమయింది.

ఆవిడకి విసుగ్గా వుంది. "ఎందుకిప్పటినించీ హడావిడి? సమయం ఆసన్నం అయ్యాక అప్పుడు చూసుకోవచ్చు కదా?" అని విసుక్కుంది.

ఇంకా నయం దాహం వేశాక బావి తవ్వుకుంటారా ఎవరైనా? ఇవ్వాళ కాకపోతే రేపు, కాకపోతే మర్నాడు. కడుపుతో వున్నమ్మ కనక మానుతుందా, వండుకున్నమ్మ తినక మానుతుందా అని సామెత చెప్పినట్లు ఆయన అనంతరం ఆ పదవి ఎలాగూ ఆవిడకే రాకమానదు.

ఇదేమైనా ప్రభుత్వోద్యోగమా, ప్రైవేటు ఉద్యోగమా విద్యార్థులూ, వయో పరిమితీ, అని నిబంధనలూ, పూర్వచరిత్ర బావుండాలి, నేర చరిత్ర వుండకూడదు అని ఆంక్షలు విధించేందుకు? రాజకీయం. ఎవరైనా, ఎప్పుడైనా రాజమార్గాన ప్రవేశించే అవకాశం వుంది కాబట్టే దీన్ని రాజకీయం అన్నారు.

అదీగాక అంతా అయిపోయాక అంత టైముండదు. హడావిడి. పదిమందీ వస్తారు పరామర్శిస్తారు. అక్కడ శవం వుండగానే తదుపరి కేండిడేటుగా ఈవిడని నిలబెడతాం అని ప్రకటించేయాలి. అప్పుడే దాని ప్రభావం కూడా సంపూర్ణంగా వుంటుంది. ఆలస్యం అయినకొద్దీ అనర్థం.

మనిషి ఇవ్వాళపోతే రేపటికి రెండు. అందునా ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం అనే లోకోక్తి వుండనే వుంది. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో ఈ మాత్రం ముందు జాగ్రత అత్యవసరం.

అందుకే ఒకవైపు మహిమ కూర్చుంది. మరోపక్క తలపండిన రాజకీయ నిపుణులు వున్నారు. ఏం మాట్లాడాలో వాళ్ళు చెప్తున్నారు? ఎలా మాట్లాడాలో మహిమ చెప్తోంది. చెప్పాల్సింది చెప్పేశాక చిన్న పరీక్ష కూడా పెట్టారు.

"అమ్మా మీ ఆశయం ఏమిటి?" అడిగారు.

"వాడి అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను నెరవేర్చడం!" చిలుకలా చెప్పింది ఆవిడ. శ్రోతలంతా మురిసిపోయారు. "చూశారా చూశారా! అప్పుడే రాజకీయ పోకడలు కనిపించేస్తున్నాయ్" అనుకున్నారు.

"ఒక నాయకురాలిగా మీ ప్రజలకు మీరేం చెయ్యదలచుకున్నారు" మరో ప్రశ్న.

"ఆయన కడదాకా ప్రజాక్షేమం కోరి రక్తం ఓడ్చి పాటుపడ్డారు. నేనూ వారినే అనుకరిస్తూ కష్టాల్లో వున్న ప్రజలను సమూలంగా నాశనం చేస్తాను" అంది ఆవేశంగా.

గతుక్కుమన్నారు శ్రోతలు. "వద్దమ్మా! ఆదిలోనే అంత ఆవేశపడిపోతే మొదటికే మోసం వస్తుంది. మీరు మాట్లాడబోయే మాటకు పూర్తిగా అర్థం తెలుసుకుని ఆనక మాట్లాడండి. లేదూ కళ్ళనీళ్ళు పెట్టేసుకోండి" అని చెప్పారు. మరికాసేపు నడిచిందా కార్యక్రమం.

మహిమ వెళ్ళబోతూ కొన్ని మెళకువలు చెప్పింది. "నేను మళ్ళీ వస్తాను. జరగరానిది ఏమైనా జరిగితే పదవి నాకే వస్తోంది కదా అని సంబరాలు పడిపోవద్దు. వీలైనంత విచారంగా వుండండి. పలుకరించడానికి వస్తే అత్యంత ఉత్సాహం ప్రదర్శించి పెళ్ళి రిసెప్షన్‌లో లాగా మీరే అందరికీ షేక్ హ్యాండ్లూ అవీ ఇచ్చి మీరే పలుకరించబోకండి. చూడ్డానికి ఎబ్బెట్టుగా వుంటుంది. అక్కడ అందరి ముందూ మీ వీపుగోకీ, చెవులు కొరికీ హితవు చెప్తే బావుండదు కాబట్టి ముందే చెప్తున్నాను" అని చెప్పి మరీ వెళ్ళింది.

ఈ తతంగం అంతా అయ్యాక హాస్పిటల్‌కి వెళ్ళింది అమ్మగారు. అప్పుడే కార్యకర్తల్లో ఆవిడపట్ల తమ ప్రవర్తనలో ఎంత మార్పు. వంగి, వంగి దండాలు పెడుతున్నారు. అది గమనించిన ఆవిడకి చాలా గర్వంగా అనిపించింది. ఆయన పక్కన కాసేపు కూర్చుని ఇంటికొచ్చేసింది. రాత్రి పడుకున్నా నిద్ర రాలేదు. ఆ రోజు తెల్లారిన దగ్గర్నించీ జరిగినదంతా నెమరువేసుకుంది.

ఏమన్నారు వాళ్ళు!! మీకెందుకు మీరూరికే నిలబడండి చాలు. మిగిలిన వ్యవహారాలన్నీ మేం చూసుకుంటాం అని కదూ! ఏంటి వాళ్ళు చూసుకునేదీ? వాళ్ళకు తెలిసిన అంశాలు తనకు తెలియకపోతాయా? కాకపోతే నాల్రోజులు కాస్త కొత్తగా వుంటుంది. అలవాటయ్యాక అన్నీ తనే ఆకళింపు చేసేసుకోవచ్చు. అంతదాకా వాళ్ళు చెప్పిన దానికంతా తలాడించి సమయం చూసి తోక కోసి సున్నం పెట్టి పంపించాలి అనుకుంది. ఆవిడ మనసుకి ఎన్నో ఆలోచనలు.

ఏ తెల్లవారుజామునకో నిద్రపట్టింది. కాస్త ఆలస్యంగానే నిద్రలేచింది.

ఆయన ఆరోగ్యం గురించిన తాజా సమాచారం అడిగి తెలుసుకుంది. గుండె విషయంలో డాక్టర్లు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఢిల్లీనుంచీ నిపుణులైన డాక్టర్లు వస్తున్నారుట. వారొచ్చి చూశాక ఏం చెయ్యాలో ఆలోచిస్తారుట. ప్రస్తుతం పరిస్థితి నిలకడగానే వుందిట.

మధ్యాహ్ననికి వచ్చారు ఢిల్లీ డాక్టర్లు. మళ్ళీ పరీక్షలవీ చేశారు. గుండెకేం ఫర్వాలేదు. తిండెక్కువైంది. అంతే. అని నిర్ధారించారు. మందులవీ కూడా ఏం అఖ్ఖర్లేదు అన్నారు.

అదంతా బయటకు చెప్పకుండా వాళ్ళేదో వైద్యం చేశారనీ ఆపరేషన్లు గట్రా అవసరం లేదనీ మాత్రం చెప్పారు. మరీ వెంటనే ఇంటికి పంపిస్తే బావుండదని ఆవేల్టికి అక్కడే వుంచి మర్నాడు డిశ్చార్జి చేశారు. ఆలోగా కార్యకర్తలు గుళ్ళల్లో కొబ్బరికాయలవీ కొట్టి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

ఆస్పత్రినించి ఇంటికి రాగానే మీడియాకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన పక్కనే కూర్చుంది ఆవిడ. మీడియా సమావేశం ముగిసింది. అంతా ఖాళీ అయిపోయింది. ఆయన భార్యవంక అనుమానంగా చూశారు. ఆవిడలో ఏదో మార్పు, ఉత్సాహం. అదివరకు లాగా ఇంట్లో లోపల కూర్చోవడం లేదు. బయటికొచ్చి అందరితో మాట్లేడేస్తూ అన్ని విషయాల్లోనూ తలదూర్చేస్తూ హుషారుగా వుంది. ఒకమాట మాట్లాడాల్సిన దగ్గర పదిమాటలు మాట్లాడేస్తుంది.

ఈ నాల్రోజుల్లో ఇంత మార్పెలా వచ్చిందా అని ఆలోచిస్తోంటే అనుమానం వచ్చింది. అంతరంగికులని పిలిచి విషయం ఏమిటని అడిగారు.

వాళ్ళు నీళ్ళు నమిలి "అదే! మీకు ప్రమాదంగా వుందంటేనూ ఎటుపోయి ఎటొస్తుందోనని అమ్మగారిని సిద్ధం చేసేశాం" అన్నారు.

వారి స్వామి భక్తికి ఆనందించాలో, వాళ్ళ ఆత్రానికి బాధపడాలో అర్థం కాలేదు ఆయనకి. సర్లే వెళ్ళండి అని పంపేశారు.

వెళ్ళబోతున్న వాళ్ళను హాల్లోనే ఆపేసి చర్చలు ప్రారంభించారు అమ్మగారు.

ఆయనకి ఆ వ్యవహారం నచ్చలేదు. నచ్చదు కూడాను.

బస్సులోంచి జనం దిగుతూ వుండగానే ఖాళీ సీట్లో తుండుగుడ్డో, చేతిసంచీనో పడేస్తే ఫరవాలేదు గానీ సీట్లో కూర్చునుండగానే వాడినెత్తిన పెట్టె పడేస్తే చిర్రెత్తుకు రాదూ! ఇప్పుడలాగే వుంది వ్యవహారం!

"ఇదుగో! ఇట్రా నువ్వు!" అని భార్యను కేకేశారు!

ఇటువంటి విషయాల్లో ముందుగానే జాగర్తపడాలి. వూరుకుంటే ఉడత గుడ్లు పెట్టిందన్నట్లు పోన్లే అనుకుంటే తర్వాత ఏకు మేకైపోతే కష్టం.

గతంలో సగభాగమే కదా అని పెత్తనం భార్యచేతికిచ్చి నిలువునా మునిగిపోయిన వారి దుర్గతి గుర్తుకొచ్చింది.

ఆయన పిలిచినా వెంటనే రాలేదు ఆవిడ. రెండుసార్లు పిలిచాక అప్పుడొచ్చింది "ఏవిటండీ మీ గొడవ! అవతల పెద్దమనుషులతో వ్యవహారాలు చర్చిస్తుంటేనూ!!" అంది కాస్త విసుగ్గా.

"నువ్వేం చర్చించక్కర్లేదు. నేనింకా బతికే వున్నాను. నువ్వు నోరుమూసుకుని లోపలికి తగలడు" అని విసుక్కున్నారు.

మిగిలినవారు కూడా "అన్నీ వారు చూసుకుంటారుగా, మీరు లోపలికి వెళ్ళండమ్మా" అన్నారు.

ఆవిడకి చిరాకువేసేసింది. "నిన్నీపాటికి నువ్వు రెడీగా వుండు రెడీగా వుండు అని ఊదరపెట్టారు. ఇవ్వాళేమో నీకెందుకు నువ్వూరుకో అంటున్నారు. ఇహ అంతా మీ ఇష్టమేనా! అదేం లాభంలేదు. ఈ పదవి ఖాళీ లేదంటే అందాకా నాకోసం మరో పదవి ఏర్పాటు చెయ్యండి" అనేసి విసురుగా లోపలికెళ్ళిపోయింది.

అందరూ తెల్లబోయారు.

ఆయన గుండె దడదడలాండింది. "ఓరి దేవుడా! దీనికప్పుడే రాజకీయం వంటబట్టేసింది. ఏదీ దారి?" అనుకున్నాడు, దీనంగా.

పత్రిక, ఫిబ్రవరి 2010